
# ఉచ్చు




## మాచన్న సంజీవరెడ్డి

సూర్యుడు పడినెత్తి కెక్కాడు.

ఎండ వేడికో మరెందుకో కాని, గొల్ల సుక్కి నుదుటి బొట్టు కరిగి సీరైంది. చేతి గాజాలు చిటపటమని పగిలి ముక్కలయ్యాయి.

గాజాలు చిటపట మనడంతోనే ఇంటి ముందు డప్పు చప్పుళ్ళు ఒక్కసారిగా మోగాయి.

పాడె పైకి లేచింది.

సుక్కి ఒక్కసారిగా, పెద్దగా ఏడ్చింది.

సుక్కితోపాటు మరి కొందరు ఏడ్పు వేగాన్ని పెంచారు.

పాడె కదులుతుంది మెల్లగా.

ఇటుపక్కో ఇద్దరు, అటుపక్కో ఇద్దరు సుక్కిని పట్టుకొని పాడె వెనకాలె మెల్లగా నడుస్తున్నారు.

జనం కదిలింది.

స్మశానం చేరుకున్నారు.

కాడు పేర్చబడింది.

"దాన్ని దూరం తీసుకు పొండ్రా ... దాన్ని దూరం తీసుకు పొండ్రి ..." యాదిరెడ్డి అరుస్తున్నాడు.

యాదిరెడ్డి అరుపు విని వల్గురు అడంగులొచ్చి

చిరకాలము నిలిచియుండు
పరిమళమునకు మరియు
రోజంతా తాజాగా ఉండుటకు
"రంభ" మరికొళందు అత్తరు
మరియు లగ్జరీ టాల్క్




50 గ్రాములు డబ్బా ధర రు 2-45 కు మించదు
4 Ml సీసా ధర రు. 7-25 కు మించదు

మరికొళందు చిన్నసైజు రు. 1-30
మరికొళందు పెద్దసైజు రు 5-25
స్థానిక పన్నులు అదనము
ఇంకను 32 ఇతర రకముల అత్తరుల
కూడ తయారుచేయుచున్నాము.
తయారీదార్లు :
మెస్సర్స్. రంభ కాస్మెటిక్స్
అడయార్. మద్రాసు .600 020.

ఆంధ్రప్రదేశ్ మరియు ఒరిస్సాకు ఏజంట్లు :
మెస్సర్స్. నరేంద్ర ఏజన్సీస్
గుర్నా గస్ రో. విజయవాడ—520 002

సుక్కిని దూరంగా తీసుకుపోయి తుమ్మ చెట్టు నీడన కూర్చోబెట్టారు.

కాడు చుట్టూ అయిదుసార్లు తిరిగి చిల్లి పెట్టిన కుండను ఎత్తేసి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు సుక్కికి దగ్గర బంధు వొకాయన.

యాదిరెడ్డి ఆ గ్రామానికి పోలీసు పటేలు కాదు. మాలీసు పటేలు కాదు. కారణం అంతకన్నా కాదు. కాని, ఆ వూళ్ళో డబ్బు పలుకుబడి ఉన్న నల్గురు పెద్దల్లో ఇతనొకడు. అంతేకాక, గొల్ల సుక్కి కుటుంబానికి డబ్బు దస్కం విషయంలో పెద్ద మనిషి, మంచి చెడు విషయంలో మార్గదర్శి.

రెండు మూడు నెల్ల కిందటే సుక్కి మొగుడికి బాగలేదని యాదిరెడ్డితో చెప్పింది. డబ్బు అడగడానికి ఇదో వంక అనుకుని — 'సరే రేపురా పదిహేను రూపాయలిస్తా. తీసుకుపోయి డాక్టరుకు చూపించు' అన్నాడు. ఆ తర్వాత సుక్కిని నాల్గుసార్లు ఇంటికి తిప్పుకుని పదిహేను రూపాయలిచ్చి పంపాడు.

ఆ ఊరికి దగ్గర్లోని మరో ఊళ్ళోని ప్రైవేటు డాక్టరు ( ఎం. బి. బి. ఎస్. చదివిన వాడు కాదు. ఎం. బి. బి. ఎస్. కి అర్థం కూడా తెలియనివాడు.) దగ్గరికి తీసుకుపోయి చూపించింది సుక్కి. అతను పసుక్కున ఒక ఇంజక్షన్ ఇచ్చి, ఒక నాల్గయిదు రకాల గోళీలు ఇచ్చి, ఒక అయిదు రూపాయలు గుంజి మరో రెండు రోజులకు రమ్మన్నాడు. రెండు రోజుల తర్వాత కూడా ఇదే వరస! పది, పదిహేను, ఇరవై — ఇలా వంద రూపాయలు ఖర్చయినవి. కాని, సుక్కి మొగుడు మాత్రం మామూలు మనిషి కాలేదు. రోజు రోజుకు దయ్యం పట్టినట్టు సన్నబడ్డాడు.

ఊరంతా వీడికి దెయ్యం పట్టిందో లేక ఎవరైన చేతబడి చేశారో అని మొత్తుకున్నారు. క్రితం రోజు అర్ధరాత్రి రక్తం కక్కుకుని చచ్చిపోయినప్పుడు — ఖచ్చితంగా వీడికి దయ్యమే పట్టింది. ఆ దయ్యమే వీడి రక్తాన్ని కళ్ళ జూసింది' అని నిర్ణయించేశారు.

కాడుకు నిప్పు పెట్టడం పూర్తయింది.

అంతా కలిసి స్నానాలు చేయటానికి ఒక బావి దగ్గరకు చేరారు.

"పాపం! అదెట్ల బతుకుతదో? ఉన్నొకతోడు వాడే" పోలీసు పటేలు.

"ఇన్నాళ్ళు యాదిరెడ్డే ఆ కుటుంబపు మంచిచెడ్డ జూసిండు. ఇక ముందు కూడా అయినే దానికో దారి జూపిస్తే బాగుంటది" మాలీపటేలు.

"ఆ దాన్దేముంది! ఒక నాల్గు రోజులు నా ఇంట్లోనే ఉంటది. ఆ తర్వాత దానిష్టం, నా ఇష్టం." యాదిరెడ్డి.

పైకి అలా అన్నాడు కాని యాదిరెడ్డి ఆలోచన వేరు. దాని మెళ్ళో పది తులాల బంగారం ఉంది. ఒక నాల్గెకరాల పొలం ఉంది. తన పెండ్లాం అయ్యాలో లేపో అన్నట్టు ఉంది!

* * *

చిన్నగా తుంపర పడుతుంది.

చల్లగా ఈదురుగాలి వీస్తుంది.

ఒకోసారి గాలితోపాటు తుంపర వేగం కూడా పెరుగుతుంది.

సుక్కి గుమ్మంలో కూర్చుని తదేకంగా ఆకాశంలోకి చూస్తోంది గతంలోని జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ.

"సుక్కీ! నా కన్నం పెడ్దువురా" అన్న రాంరెడ్డి పిలుపు విని ఉలిక్కిపడింది.

రాం రెడ్డి యాదిరెడ్డి కొడుకు. కాని, పిలుపు వింటుంటే అచ్చం తన మొగుడు పిల్చినట్టుగనే ఉంది. తనకు పెళ్ళయిన మొదటి రోజుల్లో ఇట్లనే పిల్చేవాడు ఆయన కూడా. ఒక రోజు అత్త ఇంట్లో లేనప్పుడు ఇట్లనే తుంపర పడుతుంది. ఆయన వర్షంలో తడిసొచ్చి అన్నం పెట్టమని ఇట్లనే పిలిచిండు. లేచి అన్నం పెడదామని వెళితే దగ్గరగా పిలిచి బిగ్గరగా కౌగిలించిండు.

"అబ్బ! ఒదులు అత్తొస్తుంది."

"అబ్బ! ఇప్పుడేమి రాదులే. చలిగా ఉంది."

వెచ్చని ఆయన వూపిరి తనని ఉక్కిరి బిక్కిరి చేస్తుంటే ప్చ ... అటువంటి హాయి తనకికలేదు.

"సుక్కీ — వస్తున్నావా?" మళ్ళీ రాం రెడ్డి పిలుపు విన్పించి గబుక్కున లేచి వెళ్ళింది.

అన్నం పెట్టి రాం రెడ్డి వంక చూసింది.

అచ్చం ఆయన పోలికే. ఆ గిరిజాల జుట్టు — ఆ బిగుతైన కండలు. అదేం రోగమేమో కాని పోయే ముందు పూర్తిగా సన్నబడ్డడు. కండలన్నీ మాయమై బొక్కలే తేలినై.

అందమైన ఆ జుట్టులో వేళ్ళు జొనిపింది తను. ఆ బిగుతైన కండలతో ఎన్నిసార్లు ఆటలాడింది తను. ప్చ ...! ఆ తోడు తన కిక లేదు. జీవితాంతం ఒంటరిదే తనిక.

"ఏందట్ల చూస్తవు?"

"ఊహు. ఏం లేదు ..."

"సుక్కీ! మీ కులంల మారు పెండ్లీళ్ళు జేసుకుంటరా?"

"ఎందుకు?!"

"నీ వయసే మంతయుండని ... పిల్లలు కూడా లేరు. నువ్ మల్ల పెండ్లి జేసుకుంటే ..."

కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి సుక్కికి. అక్కడ నిల్చుకోలేక గిరుక్కున వెనక్కు తిరిగింది.

• • •

రాత్రి పదయింది.

వెన్నెల భూమిమ్మీద పాల్లెల్లి పరిచినట్లుంది.

చిక్కుడు పాదు నీడలో కూర్చున్న సుక్కి వెన్నెల కేసి దీక్షగా చూస్తుంది. వెన్నెల తెలుపులో తన మొగుడి రూపు మసగా కదులుతూంది.

పెళ్ళయిన తొలి రోజుల్లో ఇలాంటి వెన్నెల రోజులెన్ని గడిపింది. హాయిగా తీయగా మత్తుగా ఇంటెనుక పెరట్లో చిక్కుడు పాదు కింద ఎన్ని సార్లు తన మీద ఒరిగి పోయాడు ఆయన. వెచ్చని ఆ స్పర్శ! తీయని ఆ రుచి!

"అత్తగిన వస్తదేమో. . ."

"ఏం రాదు పండుకుంది."

"అబ్బ! ఉండు నా కొత్తుకపోతున్నాయి రాళ్ళు."

"వెన్నెల్లో నువ్వెంత బాగున్నవో తెలుసా?"

"ఊ"

గతం గుర్తొచ్చి మోకాళ్ళ మధ్యన తల ఇరుంచుకుని వెక్కి వెక్కి ఏడిచింది.

"సుక్కీ! ఏం చేస్తున్న వక్కడ?"

రాంరెడ్డి అచ్చం ఆయన పోలికే. ఈయన మాట్లాడుతుంటే అచ్చం తన మొగడు మాట్లాడి నట్టుగనే ఉంటది.

"ఆ ఏం లేదు. నిద్ర రాకపోతే. కూర్చో".

ఎంత హాయిగా ఉందిప్పుడు తనకు. వెచ్చగా. ఎంత బాగుంది. ఈ వెన్నెల్లో ఇలా రెడ్డితో.

"ఏం దలా చూస్తున్నావు."

"ఆ. ఏం లేదు. ఏం లేదు. ఏదైన మాట్లాడు."

"ఏం మాట్లాడను?"

"మీ బాపు చాలా మంచోడు. లేకపోతే నా బతు కేమయ్యేది. ఒంటరిగా—"

"నువ్ పెళ్ళి చేసుకుంటవా సుక్కీ?"

"జేసుకుంట." ఏదో నిర్ణయించుకున్న దానిలా రాంరెడ్డి చేయిని పట్టుకుని ఒళ్ళోకి లాక్కుంది.

సుక్కి వెచ్చని స్పర్శ రాంరెడ్డిని చక్కిలి గింతలు పెట్టింది. ఆ స్పర్శలో ఏదో తీయని అనుభూతి. మత్తు! ఆ స్పర్శను విడాలనిపించలేదు. ఏవో వేడి కోర్కెలను రేపింది. మరింత దగ్గరగా జరిగి సుక్కిని అల్లుకు పోయాడు రాంరెడ్డి. సుక్కికూడా వచ్చిన అవకాశాన్ని జారవిడవకుండా రాంరెడ్డిని బలంగా తీగలా అల్లుకుంది.

•  •  •

"అరె వోరి పుల్లిగా ఇటు రారా!"

"దండం పటేలా. . ."

"ఆ ముండ సూడురా ఎంత పని జేసిందో! ఏదో మగడు సచ్చిన ముండ కదా ఒంటిగా ఎట్ల బతకతదో ఏమోనని కొన్ని రోజులు నా ఇంట్లోనే ఉండమంటే ఏం జేసిందో సూడు. నాలుగు రోజు లుందో లేదో— నా ఇంట్లోనే ఉంట పటేలా' అందిరా. సరేనన్న కాని, ఇట్ల జేస్త దనుకోలే—! అదే మా వోన్ని వంకలేసుకుందిరా! పొద్దూ మాపు దాన్దగ్గరే ఉంటుండు వాడు. వూరంతా కోడై కూస్తుంది! నా ఇజ్జతె పోవట్టె కదరా!"

"అవ్ పటేలా! నా క్కూడా తెలిసింది కాని అంటే బాగుండదని."

వాడు నా ఇంట్ల చెడి పుట్టిండ్రా! ఆ లంగ లంజకొడు కిట్ల జేస్త డనుకోలేదు. . ."

". . ."

వాడి కారండ ముండనే దొరికె నాదిరా. వాతో ఒక్క మాటంటే మంచి పోరిని జూసి పెండ్లి జేతు కదరా. . ."

". . ."

"అరేయ్! ఏం లేదురా. ఈ రాత్రికి మీ రంతా కలిసి మా వోని ఈసంతా వచ్చెడి జేయుండ్రి. దానింటె కొస్తే బొక్కలన్నీ మూర మూర జేస్తమని బెదిరించుండి. ఆ తరవాత సంగతి నేను చూసు కుంట. రేపు పంచాయితీ ఏర్పాటు చేసి మీ ఒక్కే మాట్లాడుతా. . ."

"సరే పటేలా అట్లనే జేస్తం."

'ఛి! ఛి! లుచ్చ లంజకొడుకు ఇట్ల జేస్త డనుకో కోలే' అనుకుంటూ ఇంట్లో కెళ్ళి పోయాడు యాది రెడ్డి.

•  •  •

పోలీసు పటేలు, మాలీసు పటేలు, కరణం, ఇంకా కొంతమంది పెద్దమనుషులు, యాదిరెడ్డి —అంతా గుడి అరుగు మీద కూర్చొని పంచాయితీ గురించి మాట్లాడుకుంటున్నారు.

గొల్ల పుల్లయ్య మిగతా కొందరు గొల్ల కులానికి సంబంధించిన పెద్దలు గుడి అరుగు కింద కొద్ది దూరంలో ఇదే పంచాయితి గూర్చి చర్చించుకుంటు న్నారు.

రాంరెడ్డి ఒక్కడు అట్నుంచి రంకెలు వేస్తూ వచ్చాడు.

"కాపు లంజకొడుకులకు సిగ్గ లేవు! గొల్ల లమ్మి కొడుకులు నన్ను కొడుతుంటే చూస్తూ వూకున్నరు. అరేయ్ పుల్లిగా! నిన్ను ఇయ్యాలో రేపో కాట్లెకు పంపిస్తరా." అంటూ రాంరెడ్డి పుల్లిగాడి మీదికి వురిమిరిమి చూశాడు.

"అరేయ్! లంగ బోషిడికే ఏందిరా వానిమీదికి కస్సు బుస్సు మంటున్నవు."

"ఛీ! నీకు సిగ్గు లేదు! పోలీసు పటేలు నైన వెందుకోయ్! కొట్టింది వాడు కొట్టిపిచ్చింది వాడు. వాని మీద కస్సు బుస్సు మనకపోతే నీ మీద అవాల్నానా?"

'పెద్దమనుష్యులన్న గౌరవంకూడా లేదేంరానీకు.'

". . ."

"అస్సరే కాని గొల్ల దానింటికి నువ్వెందుకు పోయినవురా?"

"ఇయ్యాల కొత్తగనా దానింటికి పోవుడం... రోజు పోతనే ఉన్నా."

"అదే రోజెందుకు పోతున్నవోన్న?"

"వూకనే పోతున్న. పోతే కొడతరన్న మాటనా?"

"అది కాదురా మరి నేవెందుకు పోతలేం దానింటికి?"

"మీకు నాకు ఏం సంబంధమే! అయితే మీరు పోతేనే నేను పోవాల్నన్న మాట! అయినా నా ఇష్టం మీ రెవ్వరే అడగేతందుకు?"

"అరేయ్! లుచ్చా లమ్డికే! అడిగిందానికి సరిగ్గా జవాబియ్యి. ఎదురు తిరుగుతవేందిరా" యాదిరెడ్డి పండ్లు పటపట కొరుకుతూ కొడుకు నుద్దేశించి అన్నాడు కసిగా.

". . ."

"చెప్పవేందిరా?" పోలీసు పటేలు.

కొద్దిసేపు ఏదో ఆలోచించుకుని అదంటే నా కిష్టం. దాన్ని పెండ్లి చేసుకుంట" అన్నాడు రాంరెడ్డి.

పెద్దమనుషులంతా కాస్సేపు నోరు మూసు కున్నారు. వీడింత మాట అంటడనుకోలేదు. ఆశ్చ ర్యంతో యాదిరెడ్డి వంక చూశారు. గొల్ల పుల్లిగాడు మిగతా వాళ్ళు కూడా యాదిరెడ్డి వంకే చూశారు. యాదిరెడ్డి మాత్రం కొడుకు రాంరెడ్డి వంకే కోపంతో చూస్తున్నాడు. మనిషంతా కోపంతో వూగిపోతున్నాడు.

"సమ్మను జెయ్యరేంది దాన్ని పెండ్లి జేసుకుంట నేను." రాంరెడ్డి.

రాంరెడ్డి మాట పూర్తి కాకముందే యాదిరెడ్డి లేచి వచ్చి రాంరెడ్డిని రెండు చెంపలు పగిలేలా కొట్టాడు. "లుచ్చా లంజకొడుకా! సిగ్గులేద్రా! బికనాప్ లమ్డికే. నా కళ్ళ ముందు నుంచి పోరా!


మీ మనస్సుల్ని ఆనందతరంగాల ఓలలాడించిన
**చండీప్రియ**
రచయిత్రి
**పోల్కంపల్లి శాంతాదేవి**
రచనలు

| | |
|---|---|
| చండీప్రియ | 12.00 |
| ఆఖరి మజిలీ | 9.00 |
| నాకౌగమనం | 10.00 |
| ఎడారిలో కోయిల | 9.00 |
| సుమలత | 8.00 |
| మేడలోని కెరటాలు | 8.00 |
| బాటసారి | 12.00 |
| ప్రేమ పూజారి | 10.00 |
| రాగ దీపం | 10.00 |
| రక్త తిలకం | 8.00 |
| పాణిగ్రహణం | 8.00 |

పుస్తకం ధర M.O. చేయండి!
పోస్టుఖర్చుకు వి.పి. చేయగలం
**నవసాహితీ బుక్ హౌస్**
ఏలూరు రోడ్
విజయవాడ - 520002






※ మా సేల్సు బ్రాంచీలు ※
1. పట్టాభి మార్కెట్. మచిలీపట్నం
2. శేషయ్య వీధి. విజయవాడ-1
3. ట్రంకు రోడ్డు. నెల్లూరు
4. టి.కార్ స్ట్రీట్. తిరుపతి
5. గాంధీ రోడ్డు. తిరుపతి
6. సుభాష్ రోడ్డు. అనంతపురం
7. ఎవెన్యూ రోడ్డు. బెంగుళూరు
8. గాంధీ బజారు. బెంగుళూరు
9. గాంధీ బజారు. షిమోగా
10. మునిసిపల్ మార్కెట్. కర్నూలు
11. జయంతి బిల్డింగ్స్. బెంగుళూరు
12. మద్రాసు రోడ్డు. కడప
13. రామన్ కోయిల్ స్ట్రీట్, చిత్తూరు

## బెల్లీ బ్యూ స్కూ. లు

( ఆం. ప్ర. ప్రభుత్వముచే గుర్తించబడినది )

మీరా టాకీస్ రోడ్డు, ఖైరతాబాద్,

హైదరాబాద్ - 500 004

ఇది ఒక ఇంగ్లీషు మీడియం. సహవిద్యా పాఠశాల ప్రశస్తమైన పోస్టులు ఖాళీలు కలవు. వ్యక్తి గతముగ ఈ స్కూలు నిపుణతతో కూడిన శిక్షణ ఇవ్వబడు. మనియార్డరు లేక క్రాస్ చేయబడిన పోస్టల్ ఆర్డరు ద్వారా రు. 5/—లు చెల్లించి ప్రిన్సిపాల్ గారి వద్ద నుండి ప్రాస్పెక్టసు, దరఖాస్తు ఫారము పొందవచ్చును. స్కూలు 12—6—1980 న తెరువబడును.

దేహపుష్టికి ఆరోగ్యానికి

పండిత డి.గోపాలాచార్యులవారి

జీవామృతం

1898 నుండి ప్రసిద్ధి గాంచినది

ఆయుర్వేదాశ్రమం

(ప్రైవేట్) లిమిటెడ్

మదరాసు-17

ఉచితం! ఉచితం!

తెల్ల మచ్చలు

మా చికిత్స ప్రారంభించగానే మచ్చలు రంగులో మార్పు వస్తుంది. పరీక్షించి మా మందు ఎంత పని చేస్తుందో చూడండి. రోగి వివరాలు వ్రాసి ఉచితంగా ఒక ప్యాకెట్ మందు పొందండి.

LALIT AYURVFDIC
PHARMACY (AW)
P.O. Katri Sarai (GAYA)

దీర్ఘ వ్యాధులకు ఉత్తమసిద్ధవైద్యం!



నరముల బలహీనత
కామపుష్టి యవ్వనశక్తి
హెర్నియా చర్మవ్యాధులకు
పోస్టు ద్వారా కూడా కలదు
వరిబీజం (బుడ్డ)
మూత్రవ్యాధులకు
ఆపరేషన్ లేకుండా-రండి

డా॥ దేవర, ఫోన్: 551, మార్కెండేయ వీధి, తెనాలి.


భాండ 7/11వ పేజీ, సుబ్బ... గుంటూరు—2

నీకు పెళ్ళి జేసుకుంటడట! ఆహా! తెలివైన కొడుకా! చేసుకుంటడ్రా బిడ్డ నిన్ను జూసి! ఛా!'' అంటూ కాండ్రించి ఊసాడు.

''అరేయ్ రాంరెడ్డి! ఇప్పుడు కదరా మీ బాపు మాటలు. ఇగ నా మాటలుకూడా ఇనా—ఈ ఊళ్ళనుంచి తక్షణం మీరా కనిపించకుండా పో! ఏడున్న బతుకు, ఎట్ల నున్న బతుకు మా ఊ ప్రాంతం ఒక సంవత్సరం దాకా కనిపించద్దు, ఆ తరవాత నీ ఇష్టం.''

మొండిగా పోలీసు పటేలు ఆ తరవాత మాలీసు పటేలు, కుటుంబం అంతా అంతే! ఒకే మాట. యాది పెద్ద పేళ్ళ మాట అన్ని, వింటూ కామ్గా కూర్చున్నాడు. గొల్ల పుల్లిగాడు మాత్రం లేచి—''ఏడాది తరవాత ఏడినా పిల్ల ఏ ఇండ్ల దిక్కు రాదద్దు, దానింటికి పోదద్దు. ఒక వేళ పిల్లగిని దానింటికి పోతే ఊళ్లో యాడాది పూరెడిచి ఎళ్ళిపోవాలి'' అన్నాడు మిగతా పెద్దమనుషులు తెప్పలా మాట్లాడలేదు.

రాంరెడ్డిలో రక్తం కుత కుత ఉడికింది. కాని ఏం చేయగలడు. రాంరెడ్డి ఒక్కడు—ఊరంతా అతనికి వ్యతిరేకం.

''అయితే పాండవులు అజ్ఞాతవాసం చేసిన తీర్పులాట నాది. బాగుంది! కౌరవులంతా కలిసి అయిదుగురు పాండవులకు అజ్ఞాతవాసం పంపించారు. కాని, మీరంతా కలిసి నన్నొక్కణ్ణి అజ్ఞాతవాసం పంపిస్తున్నారు. ధర్మరాజు జూదంలో ఓడి పందుకు కష్టాలు అనుభవించారు. కాని నేను మొగుడు వచ్చి దాన్ని పెండ్లి జేసుకుంటానంటే అజ్ఞాతవాసం పంపుతున్నారు. ఇందులో ఏది న్యాయమో? సరే ఈ రాత్రికే ఊరిడిచి వెళతాను' అంటూ వెనుదిరిగాడు రాంరెడ్డి.

• • •

రాత్రి తొమ్మిదయ్యింది.

రాంరెడ్డి తనకు కావలసిన సామానంత సంచిలో వేసుకుని మూటి కట్టాడు. పండుకోను ఒక దుప్పటి గొంగడి, కట్టుకోను రెండు ధోవతులు, కమీజులు కలిపి తాడుతో బాగా బిగించి కట్టాడు.

వెళ్ళే ముందు తండ్రికి చెప్పాలా వద్దా అనుకుని ఎందుకులే కన్న కొడుకన్న జాలైనా లేకుండా ఇంట్లోంచి వెళ్ళగొట్టే వాడికి చెప్పడం దేనికి' అను కుంటూ గడప దాటాడు.

ఒకసారి సుక్కికి చెప్పిపోతే — యేడాది దాకా దాని మొఖం చూడడు. మల్ల, అదెట్ల బతుకుతదో ఏమో — అదెంత ఏడుస్తుందో నేను ఊరిడిచి వెళుతున్నానని తెలిసి! ఈ లంజ కొడుకులు జేయి పట్టికనే కని లేకపోతే తను దాన్ని పెండ్లి జేసుకుంటే దాని బతుక్కో దారి ఏర్పడేది. ఒక పనిజేస్తే! దాన్ని కూడా తనతో పాటే దీసుకుపోతే! మరిక్కడ దాని భూమి ఏమైపోతది! ఆ ఏమైపోతది. ఏడాది తర్వాత వచ్చి అదెవ్వరికైనా అమ్మితే పోతది. ఇప్పుడు దాని మెళ్ళో పది తులాల బంగారం ఉంది. దానితోని ఏ వూళ్ళోనైన ఇంత భూమి కొని బతకొచ్చు. తన మాట కాదన దది. ఈ వూళ్ళో లమ్డీకొడుకులు బతుకనిచ్చేటట్లు లేదు. అసలీ పాటికే తనకోసం ఎదురు చూస్తుండొచ్చు అది — నేను పోతున్నని తెలిసి వాతో రావటానికి అది అన్ని ఏర్పాట్లు చేసుకో


## తోడేళ్లు

అడవుల్లో తోడేళ్ల
సంతతి అనుమరుగై దట
చూడ నగరం వీధుల్లో
తారసపడుతూ ఎదట

- ఎల్లోరా


వచ్చు.

రాంరెడ్డి మనసునిండా సుక్కి గురించి ఆలోచనలే! సుక్కి ఇంటి గుమ్మం ఎక్కాడు.

సుక్కి తనకోసం తలుపులు తెరుచుకుని ఎదురు చూస్తుందనుకున్నాడు. కాని తలుపులు మూసేసి ఉన్నాయి. నిద్రపోయిందేమో అనుకున్నాడు. పిలుద్దా మనుకున్నాడు. ''సు ...'' పిలవబోయి ఆగిపోయాడు. లోపలి నుంచి తన బాపు గొంతు విన్పిస్తుంది! చర చర ఇంటి వెనకకు పోయి గోడెక్కి దూకాడు. రాం రెడ్డి దూకగానే అక్కడున్న ఆవులు రెండు బెదిరాయి. ఒక ఆవు దగ్గరకు పోయి దాన్ని దువ్వి, మెళ్ళోంచి పలుపు వూడ జెరికాడు. గుంజ నుంచి మిగిలిన కొసను ఊడదీశాడు. పెరడి తలుపులు తీసుకొని ఇంట్లోకి ప్రవేశించాడు.

''సుక్కీ! వాణ్ణెందుకు పట్టుకుంటవే. వాడు చిన్న పోరడు! అయినా నిన్ను నా ఇంట్లో ఉంచుకుంది వాడికోసం కాదే—నా కోసమే! కాని, మొగుడు వచ్చిన కొత్త కదాని ఇప్పుడప్పుడే బాగుండదని వూకున్నా. దానికి నువ్వింత తొందర పడతావే...''

''. . . . . .''

''వాడి భయం నీ కింక లేదే! వాణ్ణీవూరు నుంచి తరిమే ఏర్పాటు నే జేసినా! ఇంకో ఏడాది దాకా వాడు రాడు. వచ్చినా నీ ఇంటికి రాడు. ఒక వేళ నీ ఇంటికి వస్తే మల్లో ఏడాది వాడు వూరోళ్ళకు కన్పించ కుండా పోవాల్సిందే! వాణ్ని కొట్టించి ఈ ఏర్పాటు చేశా నేనే! పంచాయితి ఏర్పాటు చేయించిందికూడా నేనే!!''

సుక్కిని కౌగిట్లోకి బంధిస్తూ తండ్రి అంటున్న మాటలు వినేసరికి రాం రెడ్డి మెదడులోని రక్త నాళాలు పొంగాయి. కళ్ళల్లో ఎర్ర జీరలు కమ్మాయి. రాం రెడ్డి ప్రతి అవయవంలోనూ తుఫాన్ వచ్చే ముందు సముద్రంలో జరిగే అలజడి లాంటిది మొదలయింది.

అంతే!

ఒక్కసారిగా చేతిలోని జనప పగ్గాన్ని ఉచ్చుగా మార్చి తండ్రి మీదికి విసిరాడు. కసిగా లాగుతూ. దూలానికి వ్రేలాడదీశాడు! సుక్కి ఇదంతా మవు నంగా భయంతో వణకుతూ చూస్తూ నిల్చుంది.

''నాకు ఒకే సంవత్సరం అజ్ఞాత వాసం విధించారు మీరు. కాని, నేను నీకు జీవితాంతం అజ్ఞాతవాసం విధించాను!'' కసిగా అంటూ వెనుదిరి గాడు రాం రెడ్డి!

*